అక్షర దర్బార్

www.aksharadarbar.com

voice of the people

వెల ₹5

గురువారం 26, డిసెంబర్ 2024 | సంపుటి :02 | సంచిక :274 | పేజీలు :06

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అట్టహాసంగా ప్రెస్ క్లబ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం

03

సోనియాగాంధీకి అస్వస్థత !

- ఆస్పత్రిలో చేరిన కాంగ్రెస్ అగ్రనేత !
- సీడబ్ల్యూసీ మీటింగ్‌కు గైర్హాజర్
- బెలగావిలో రేండ్రోజులపాటు సమావేశాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్‌తోపాటు పలువురు మంత్రులు హాజరు

04

ప్రేమ చావు !

పోలీస్ శాఖలో వరుస విషాద ఘటనలు

- కలకలంరేపుతున్న ఎస్సైల ఆత్మహత్యలు
- ఈనెల 2న వాజేడు ఎస్సై హరీష్ సూసైడ్
- సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని మృతి
- తాజాగా భిక్కనూరు ఎస్సై సాయికుమార్..
- ఎల్లారెడ్డి పెద్ద చెరువులో డెడ్‌బాడీ
- అదే చెరువులో మహిళా కానిస్టేబుల్ మృతదేహం..
- లవ్ ఎఫైర్ కారణమని అనుమానాలు
- ఈనెల 3న రంగారెడ్డి జిల్లాలో మహిళా కానిస్టేబుల్ దారుణ హత్య
- కులాంతర వివాహం వల్లే మర్డర్

02

పోలీస్‌శాఖలో వరుసగా విషాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టే బుళ్ల ఆత్మహత్యలు డిపార్ట్‌మెంట్‌లో కలకలం రేపుతున్నాయి. ఆరు నెలల వ్యవధిలోనే రాష్ట్రంలో ముగ్గురు ఎస్సైలు సూసైడ్ చేసుకోగా, అందులో ఇద్దరి బలవన్మరణాలకు ప్రేమ వ్యవహారమే కారణమని చర్చ జరుగు తోంది. డిసెంబర్ 2న ములుగు జిల్లా వాజేడు ఎస్సై హరీష్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని చనిపోవడం పోలీస్ వర్గాల్లో తీవ్ర విషాదం మిగిల్చింది. ఈ ఘటన మరవక ముందే తాజాగా కామారెడ్డి జిల్లాలోనూ ఇలాంటి ఘటనే వెలుగు లోకి వచ్చింది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ డెడ్‌బాడీ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో లభ్యమవడం అందర్నీ షాక్‌కు గురిచేసింది. ఈనెల 3న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో మహిళా కానిస్టేబుల్ దారుణ హత్యకు గురవగా, ప్రేమ, కులాంతర వివాహమే మర్డర్‌కు కారణమని పోలీసులు నిర్ధారించిన సంగతి తెలిసిందే.

- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

ఇసుక క్వారీల్లో దౌర్జన్యం..!

- అంతా మా ఇష్టమే అంటున్న కాంట్రాక్టర్లు
- లోడింగ్ ఛార్జీ, ఎక్స్‌ట్రా బకెట్ పేరుతో దోపిడీ
- ఆ సంబంధిత అధికారికి వాటా ఎంత..?
- ఇక్కడంతా ఓపెన్ సీక్రటేనంటూ జులుం
- ఆయా శాఖల అధికారులకు సైతం షేర్లు

05

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో గోదావరి తీరాన ఇసుకాసురులు రాజ్యమేలుతున్నారు. కాళేశ్వరం పరిధిలో కొనసాగు తున్న ఇసుక క్వారీల్లో కాంట్రాక్టర్లు దౌర్జన్యం సృష్టిస్తూ కమాయిస్తున్నారు. అడ్డదిడ్డంగా ఇసుకను తోడుతూ తమకు నచ్చినట్లుగా అమ్ము కుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఇసుక క్వారీలు నడవాల్సింది ఉండగా ఇక్కడ అవేమి తమకు గిట్టవంటూ దర్జాగా అక్రమాలకు పాల్పడుతు న్నారు. జీరో దందా, లోడింగ్ ఛార్జ్, ఎక్స్ ట్రా బకెట్ పేరుతో రోజూ లక్షల్లో గడిస్తూ మాకెవ్వరూ అడ్డంటూ ఓపెన్ ఛాలెంజ్ విసురుతుండగా పట్టించు కోవాల్సిన సంబంధిత టీజీఎండీసీ, మైనింగ్, విజులెన్స్, రవాణా శాఖల అధికారులు కాస్తా క్వారీ కాంట్రాక్టర్లు ఇచ్చే మామూళ్ల మత్తు నుంచి తేరుకోలేక నిద్రావస్థలో ఉంటున్నారని ఆరోపణలు గుప్పుమం టున్నాయి. ఇలా మహదేవపూర్ మండలంలో ఇసుక క్వారీల కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుకను తమకిష్టమొచ్చినట్లుగా తీసుకెళ్తుండగా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో వారు ఆడిందే ఆటగా పాడిందే పాటగా నడుస్తోంది.

– అక్షరదర్బార్, కాటారం

భార్యాభర్తలు ఆత్మహత్య

లక్ష్మీపురంలో విషాదం

02

పుష్ప 2పై ఫిర్యాదు

- దర్శకుడు, నిర్మాత, హీరోపై చర్యలు తీసుకోవాలి
- హనమకొండ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ జర్నలిస్టు గడ్డం కేశవమూర్తి కంప్లైంట్

05

బెనిఫిట్ షోలు బంద్

సినీ ప్రముఖులతో సీఎం రేవంత్ రెడ్డి

04

గురువారం
26.12.2024
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

ప్రేమ..చావు!

పోలీస్ శాఖలో వరుస విషాద ఘటనలు

అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి:

పోలీస్‌శాఖలో వరుసగా విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్ల ఆత్మహత్యలు డిపార్ట్‌మెంట్‌లో కలకలం రేపుతున్నాయి. ఆరు నెలల వ్యవధిలోనే రాష్ట్రంలో ముగ్గురు ఎస్సైలు సూసైడ్ చేసుకోగా, అందులో ఇద్దరి బలవన్మరణాలకు ప్రేమ వ్యవహారమే కారణమని చర్చ జరుగుతోంది. డిసెంబర్ 2న ములుగు జిల్లా వాజేడు ఎస్సై హరీష్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని చనిపోవడం పోలీస్ వర్గాల్లో తీవ్ర విషాదం మిగిల్చింది. ఈ ఘటన మరవక ముందే తాజాగా కామారెడ్డి జిల్లాలోనూ ఇలాంటి ఘటనే వెలుగులోకి వచ్చింది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ డెడ్‌బాడీ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో లభ్యమవడం అందర్నీ షాక్‌కు గురిచేసింది. ఈనెల 3న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో మహిళా కానిస్టేబుల్ దారుణ హత్యకు గురవగా, ప్రేమ, కులాంతర వివాహమే మర్డర్‌కు కారణమని పోలీసులు నిర్ధారించిన సంగతి తెలిసిందే.

యువతితో పరిచయమే కొంప ముంచింది

ఈనెల 2న ములుగు జిల్లా వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆత్మహత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పూసూరు జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రైవేటు రిసార్టులో ఆయన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకున్నారు. తల కింది భాగం నుంచి తూటా వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. అయితే.. యువతితో ప్రేమ వ్యవహారమే హరీష్ సూసైడ్‌కు కారణమని పోలీసులు తేల్చారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దుదియ తండాకు చెందిన యువతి ఏడు నెలల క్రితం రాంగ్ నంబర్‌తో ఫోన్ చేసి ఎస్ఐతో పరిచయం పెంచుకుంది. కొద్ది రోజుల తరువాత తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయంటం ప్రారంభించింది. తనను పెళ్లి చేసుకోకపోతే అధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరిస్తూ, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడింది. ఆమె కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన

కలకలంరేపుతున్న ఎస్సైల ఆత్మహత్యలు

- ఈనెల 2న వాజేడు ఎస్సై హరీష్ సూసైడ్
- సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని మృతి
- తాజాగా భిక్కనూరు ఎస్సై సాయికుమార్..
- ఎల్లారెడ్డి పెద్ద చెరువులో డెడ్‌బాడీ
- అదే చెరువులో మహిళా కానిస్టేబుల్ మృతదేహం..
- లవ్ ఎఫైర్ కారణమని అనుమానాలు
- ఈనెల 3న రంగారెడ్డి జిల్లాలో మహిళా కానిస్టేబుల్ దారుణ హత్య
- కులాంతర వివాహం వల్లే మర్డర్

ఎస్ఐ హరీశ్.... మండపాక శివారులోని ఓ రిసార్ట్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించిన సంగతి తెలిసిందే.

కులాంతర వివాహం చేసుకుందనే కోపంతో..

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్య అప్పట్లో కలకలం రేపింది. కులాంతర వివాహం చేసుకుందనే కోపం, ఎకరం భూమి తనకివ్వలేదనే కక్షతో సొంత అక్కను తమ్ముడే కిరాతకంగా హత్య చేశాడు. హైదరాబాద్ శివారు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 3న ఈ దారణం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామానికి చెందిన కొంగర నాగమణికి పదేళ్ల కింద పెళ్లైంది. 2022లో భర్తతో విడాకులు తీసుకుంది. అనంతరం స్వగ్రామానికే చెందిన చిన్ననాటి స్నేహితులుడు బండారి శ్రీకాంత్‌ను ప్రేమించింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. శ్రీకాంత్ తక్కువ కులానికి చెందిన వాడనే కారణంతో సోదరుడు పరమేశ్ పెళ్లికి ఒప్పుకోలేదు. ఈ విషయంలో ఇంట్లో పలుమార్లు గొడవలు జరిగాయి. సోదరుడు, పెద్దలు అంగీకరించకపోయినా నవంబరు 10న యాదగిరి గుట్టలో పెళ్లి చేసుకున్నారు. దీంతో అక్కపై కక్షపెంచుకున్న తమ్ముడు దారుణంగా హత్యచేశాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కటకటాలకు పంపారు.

ఒకే చెరువులో ముగ్గురి మృతదేహాలు

కామారెడ్డి జిల్లా భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సహకార సంఘంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నిఖిల్ అనే యువకుడు ఒకే రోజు అదృశ్యవమడమేగాక.. ఒకే చెరులో ముగ్గురి మృతదేహాలు లభ్యమవడం కలకలం సృష్టించింది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఒడ్డున వారి వస్తువులు కనిపించడంతో పోలీసులు చెరువులో బుధవారంరాత్రి గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి సమయానికి శ్రుతి, నిఖిల్ మృతదేహాలు చెరువులో లభ్యమయ్యాయి. జిల్లా ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో పోలీసులు వెతకగా.. అదే చెరువులో ఎస్సై సాయికుమార్ మృతదేహం ఇవాళ ఉదయం దొరికింది. ఎస్ఐ, కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ ముగ్గురు చెరువులో ఆత్మహత్య చేసుకోవడం కామారెడ్డి జిల్లాలో మిస్టరీగా మారింది. ముగ్గురు ఒకే చోట ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారు ? ఆత్మహత్య చేసుకోవడానికి దారితీసిన పరిణామాలు ఏంటి ? అనే విషయాలు తెలియాల్సి ఉందని కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారించి అసలు నిజాలు బయటకు తీస్తామని ఆమె వెల్లడించారు.

మృతి చెందిన రమేష్, తిరుపతమ్మ

భార్యాభర్తలు ఆత్మహత్య

- లక్ష్మీపురంలో విషాదం

అక్షరదర్బార్, వరంగల్: క్షణికావేశంలో భార్యాభర్తలు ఇద్దరూ తమ ప్రాణాలొదిలారు. వరంగల్ గిర్మాజిపేటలోని లక్ష్మీపురంలో ఈ దుర్ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం లక్ష్మీపురంలో నివసిస్తున్న ఓని రమేష్, తిరుపతమ్మ దంపతులు బుధవారం గొడవపడ్డారు. వీరికి ఇద్దరు కొడుకులు గౌతమ్ (12), గణేష్ (7) ఉన్నారు. రాత్రి తమ పిల్లలు నిద్రలోకి జారుకున్న తర్వాత రమేష్ (35), తిరుపతమ్మ (30) దంపతులు తమ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గొడవ పడిన భార్యాభర్తలు ఇద్దరు క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడటం లక్ష్మీపురంలో విషాదం చిమ్మింది. మృతుడు రమేష్ సోదరుడు ఓని ఎల్లస్వామి గురువారం ఇచ్చిన సమాచారంతో వరంగల్ ఇంతెజార్ గంజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. రమేష్, తిరుపతమ్మ మృతదేహాలను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అట్టహాసంగా ప్రెస్ క్లబ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం

అక్షరదర్బార్, హన్మకొండ: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు తాను కట్టుబడి ఉన్నానని, నిరంతరం అందరికీ అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ 2024 ముగింపు కార్యక్రమం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాజీ మేయర్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హాజరయ్యారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజ అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. తాను 30 ఏళ్లుగా రాజకీయాల్లో రాణిస్తున్నానంటే అందుకు జర్నలిస్టుల సహకారం సంపూర్ణంగా ఉండటమే కారణమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. తాను మేయర్ గా ఉన్న సమయంలో జర్నలిస్టులకు సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రకాష్ రెడ్డి పేటలో ఇందిరమ్మ కాలనీని ఏర్పాటు చేసి అందులో ఆ రోజుకు వర్కింగ్ లో ఉన్న జర్నలిస్టులందరికీ బీపీఎల్ కింద ఇంటి స్థలాన్ని అందించామని తెలిపారు. అందులో ఇప్పుడు చాలామంది ఇండ్లు కట్టుకొని నివసిస్తున్నారని.. అది చూసి చాలా సంతోషిస్తున్నానని చెప్పారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ... ప్రెస్ క్లబ్ అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉంటాయని.. క్లబ్బు ప్రహరీ గోడకు 10 లక్షల రూపాయలు కేటాయించి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల చిరకాల కోరిక సొంతింటి స్థలం అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే నాయినికి విజ్ఞప్తి చేశారు. స్పోర్ట్స్ మీట్ లో భాగంగా విజేతలకు బహుమతుల ప్రదాన చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, టీయుడబ్ల్యూజె (హెచ్-143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ.ఆర్.లెనిన్, టిబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, టీ యుడబ్ల్యూజె (ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షు డు గడ్డం రాజిరెడ్డి, కార్యదర్శి తోట సుధాకర్, వరంగ ల్ జిల్లా కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, టీయూడబ్ల్యూజే హెచ్ 143 హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మెండు రవీందర్, కార్యదర్శి ఉమేందర్, ఐజేయూ రాష్ట్ర హౌసింగ్ అండ్ వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పీ.వీ మదన్ మోహన్, పిన్నా శివకుమార్, గడ్డం కేశవమూర్తి పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్య అతిథులు

అకాల వర్షంతో నష్టపోయిన రైతులని ఆదుకోవాలి

- బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్

అక్షర దర్బార్, కాటారం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాటారం బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఓ ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.కా టారం సబ్ డివిజన్ మండల పరిధిలో అకాల వర్షానికి కల్లాల్లోని వరి ధాన్యం తడిసిపోయిందని, ప్రభుత్వం మద్దతు ధరతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. అలాగే ఈ ప్రాంతం లో పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలను సైతం సాగుచేస్తారని అకాల వర్షం కారణంగా ఆ పంటలు పాడై పోయాయని ఈ క్రమంలో పత్తి,మిర్చి పంటలని సర్వే చేయించి రైతులకు తగిన న్యాయం చేసి ఆదుకోవాలని రామిళ్ల కిరణ్ ప్రభుత్వాన్ని కోరారు.

అనాథాశ్రమంలో అన్నదానం

అక్షర దర్బార్, కాటారం: కాటారం మండలం దామరకుంట గ్రామానికి చెందిన తోడే శ్వేత-వంశీకృష్ణ దంపతుల కుమారుడు శ్రీతిక్ వేదన్ష్ రెడ్డి రెండో పుట్టిన రోజు సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అమృత వర్షిని అనాథాశ్రమంలో వృద్ధులకు గురువారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అమృత వర్షిని నిర్వాహకులు శ్యామ్, బండం తిరుపతిరెడ్డి, గోనె అజయ్ రెడ్డి, బాసాని శ్రీ ప్రియ, సూరం వర్ణిత తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి నిందితుడి అరెస్ట్

అక్షర దర్బార్,మహాదేవపూర్: పలిమెల మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన రాజం మల్లయ్య అనే వ్యక్తి తనపై లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలు పలిమెల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మేరకు పలిమేల ఎస్సై తమాషా రెడ్డి తన సిబ్బందితో కలిసి నిందితుడిని అరెస్టు చేసినట్లు మహదేవపు సీఐ రామచంద్రరావు తెలిపారు. బాధితురాలు సోమవారం రాత్రి ఫిర్యాదు చేయగా గురువారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించినట్లు సీఐ వివరించారు.

ఇండియాలో సీపీఐది వందేళ్ల చరిత్ర

- పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి భిక్షపతి
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

జెండాను ఆవిష్కరిస్తున్న భిక్షపతి

అక్షర దర్బార్, శాయంపేట : భారతదేశంలో వందేళ్లు కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు. గురువారం శాయంపేట మండల కేంద్రంలో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ జెండాను జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి బత్తిని సదానందం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో తోట భిక్షపతి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటం నిర్వహించి నాలుగున్నర వేల మంది సిపిఐ కార్యకర్తలు రక్త తర్పణం చేసి 3వేల గ్రామాలను పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత సీపీఐకి దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, నాయకులు గుంటి రాజేందర్, వొల్లాల రమేష్, ఎండి అంకుశావలీ, పుట్ట కళావతి, బోగి రామదేవి తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణ కంచెలకు కరెంట్ కనెక్షన్ ఇవ్వొద్దు

- ఎన్పీడీసీఎల్ ఏఈ చందూలాల్

కరెంట్ కనెక్షన్ తొలగిస్తున్న ఏఈ చందూలాల్

అక్షర దర్బార్, శాయంపేట : రైతులు తాము పండించిన పంటలను అడవి పందుల బెడద నుండి కాపాడుకోవడానికి పంట చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి, విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారని, ఇది ప్రమాదకరమని ఎన్పీడీసీఎల్ ఏఈ చందులాల్ తెలిపారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో గురువారం 11 కేవీ విద్యుత్ వైర్లకు పంట రక్షణకు అక్రమ కనెక్షన్ వేసుకున్న వైర్లను గుర్తించి సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. పంట చుట్టూ ఇనుప తీగలతో కంచె ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారని, దీంతో అడవి పందులు మరణిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి ఘటనలతో అర్ధరాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనల్లో విద్యుత్ ప్రమాదాలు జరిగితే విద్యుత్ శాఖకు ఎలాంటి సంబంధం ఉండదని హెచ్చరించారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత

అక్షర దర్బార్,మహాదేవపూర్ : మహదేవపూర్ గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి చేనపూరి మహేష్ తన మొబైల్ ను పోగొట్టుకోగ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. కాగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అట్టి మొబైల్ ను గుర్తించి గురువారం బాధితునికి అప్పగించారు. మొబైల్ ను గుర్తించడంలో కృషిచేసిన కానిస్టేబుల్ చంద్రమోహన్ ను ఎస్సై పవన్ కుమార్ అభినందించారు అలాగే తన మొబైల్ ను అప్పగించిన ఎస్సై కి పోలీస్ సిబ్బందికి మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మొబైల్ ఫోన్ ను అందజేస్తున్న ఎస్సై పవన్ కుమార్

హాకీ క్లబ్ టీంకు మున్సిపల్ చైర్ పర్సన్ శుభాకాంక్షలు

అక్షర దర్బార్, పరకాల : సీఎం కప్ రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ కు ఎంపికైన పరకాల ధ్యాన్ చంద్ హాకీ క్లబ్ కు చెందిన ఏడుగురు క్రీడాకారులు హనుమకొండ హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సోదా రామకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి సోదా రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ధ్యాన్ చంద్ హాకీ క్లబ్ టీం బొజ్జం రాకేష్, నరేష్, నాగార్జున, రత్నాకర్, క్రాంతి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు తెలుపుతున్న సోదా రామక్రిష్ణ

క్వారీ గుంతలో పడి యువకుడి గల్లంతు

అమ్మాపురంలో ఘటన

హరీష్ (ఫైల్)

అక్షర దర్బార్,తొర్రూరు: తొర్రూరు మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన కడెం హరీష్ (17) అనే యువకుడు గ్రామంలోని క్వారీ గుంతలో ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. యువకుడు గల్లంతై 24 గంటలు గడుస్తున్నా సంఘటన స్థలానికి రెస్క్యూటీం చేరుకోకపోవడంతో ఫైర్ సిబ్బందితో పాటు గజ ఈతగాళ్లు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం క్వారీ గుంత వద్ద గ్రామస్తులతో కలిసి పోలీస్ అధికారులు గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. యువకుడి మృతదేహం ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

అసంపూర్తిగా ఉన్న ఆలయంపై రాజకీయమా ?

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ లో అసంపూర్ణంగా శ్రీ వెంకటేశ్వర ఆలయంపై రాజకీయం తగదని, ఆలయ నిర్మాణం పూర్తి చేసి టీటీడీ లేదా ఎండోమెంట్ వారికి అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామని మాజీ ఎమ్మెల్యే, ఆలయ ధర్మకర్త, చైర్మన్ గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. గురువారం ఆలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంజూర్ నగర్ లో ఏడాదిలోనే వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించామని, ఇంకా రాజగోపురం, ఉత్తర ద్వారం, యాగశాల, ప్రహరీ, పాకశాల నిర్మాణ పనులు ఇంకా చేయాల్సి ఉందని పేర్కొన్నారు. అందుకు సరిపోనూ మెటీరియల్ కూడా వచ్చిందని, సంక్రాంతి వరకు పనులు పూర్తవుతాయని తెలిపారు. ఆలయాన్ని ఎండోమెంట్ కు అప్పగించాలని స్థానిక ఎమ్మెల్యే సదరు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసిందని, కానీ ఆలయంలో పనులు పూర్తయిన తర్వాత టీటీడీకి ఆలయ నిర్వహణ బాధ్యతలు అప్పగించే ఆలోచన ఉందని, లేకుంటే ఎండోమెంట్ కే అప్పగిస్తామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

సోనియాగాంధీకి
అస్వస్థత !

- ఆస్పత్రిలో చేరిన కాంగ్రెస్ అగ్రనేత !
- సీడబ్ల్యూసీ మీటింగ్ కు గైర్హాజర్
- బెలగావిలో రెండ్రోజులపాటు సమావేశాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ తోపాటు పలువురు మంత్రులు హాజరు

అక్షరదర్బార్, బెలగావి: ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. కర్ణాటకలోని బెలగావిలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాలకు సోనియా హాజరుకావాల్సి ఉంది. కానీ, అస్వస్థతకు గురికావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. సోనియాతో పాటు ప్రియాంకాగాంధీ కూడా అక్కడే ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం సీడబ్ల్యూసీ సమావేశాల్లో రాహుల్ గాంధీ మాత్రమే పాల్గొన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ముఖ్యమంత్రి, మంత్రులు హాజరు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ కర్ణాటక వెళ్లారు. గురువారం ఉదయం 11 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన బయలుదేరారు. బెలగావిలో రెండ్రోజులపాటు సీడబ్ల్యూసీ సమావేశాలు జరగనున్నాయి. ఇవాళ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశాల్లో సీఎం పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచందర్ రెడ్డి సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక విమానంలో వీరంతా హైదరాబాద్ నుంచి వెళ్లారు.



ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి బర్త్ డే ను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు గురువారం నరేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ లోని నరేందర్ రెడ్డి నివాసంలో ఆయన్ను కలిశారు. రవీందర్ రావు వెంట ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ బొజారెడ్డి ఉన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైన తెలుగు సినిమా పరిశ్రమ పెద్దలు

బెనిఫిట్ షోలు బంద్

- శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉంటాం
- సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి
- సినీ ప్రముఖులతో సీఎం రేవంత్ రెడ్డి
- సినీ పరిశ్రమ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం..

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో ఇకపై బెనిఫిట్ షోలు ఉండవని సీఎం రేవంత్ రెడ్డి సినీ ప్రముఖులకు తెల్చి చెప్పారు. అసెంబ్లీలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తెలిపారు. ప్రభుత్వం ఇండస్ట్రీతోనే ఉంటుందని, అభిమానుల్ని కంట్రోల్ చేసుకోవాల్సిన బాధ్యత సెలబ్రిటీలదేనని అన్నారు. బంజారాహిల్స్లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఎఫ్డీసీ చైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో సుమారు 50 మంది సినీ ప్రముఖులు సీఎంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిలో పరిశ్రమ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన, మహిళా భద్రతపై ప్రచారంలో సినీ ప్రముఖులు చొరవ చూపాలన్నారు. అలయ పర్యటకం, ఎకో టూరిజంను ప్రచారం చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్మెంట్ల విషయంలోనూ ఇండస్ట్రీ సహకరించాలని కోరారు. ఇకపై బౌన్సర్లపై సీరియస్గా ఉంటామని సీఎం హెచ్చరించారు.

సినీ పరిశ్రమ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం..

సినీ పరిశ్రమలో సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరలు, బెనిఫిట్ షోలపై చర్చించి నిర్ణయించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే సినీ పరిశ్రమ సమస్యలపై చర్చించి నిర్ణయించాలన్నారు. సినీ పరిశ్రమ తరపున సీఎంకు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి వినతిపత్రం అందించింది. ఈ భేటీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సినీ ప్రముఖులు... అల్లు అరవింద్, సురేష్ బాబు, మైత్రి రవి, నవీన్, నాగవంశీ, సి కల్యాణ్, గోపీ ఆచంట, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగార్జున, వెంకటేశ్, నితిన్, కిరణ్ అబ్బవరం, సిద్ధు జొన్నలగడ్డ తదితరులు హాజరయ్యారు.

రిక్వెస్ట్ బస్టాప్ ఎక్కడ?

- శంకుస్థాపన బండ ఏమైంది?
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- రోడ్డెక్కనున్న గ్రామస్తులు

అక్షర దర్బార్, పరకాల : పరకాల హనుమకొండ ప్రధాన దారిలో పెద్దకోడేపాక క్రాస్ వద్ద ఎప్పుడో పరకాల గ్రామానికి చెందిన ప్రముఖ వైద్య ఎన్నారై రిక్వెస్ట్ బస్ స్టాప్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఇప్పటి వరకు రిక్వెస్ట్ బస్ స్టాప్ కార్యరూపం దాల్చలేదు. ఆ రిక్వెస్ట్ బస్టాప్ ఉండాల్సిన ప్రాంతంలో ప్రస్తుతం ఒక ఫంక్షన్ హాల్ నిర్మాణం జరిగి బస్టాప్ శంకుస్థాపన బండ లేకుండా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాప్ లేకపోవడంతో ప్రయాణికులు వర్షం, ఎండ, చలిలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొంటున్నారు. బస్టాప్ నిర్మించాల్సిన స్థలం ఏమైందో అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. స్థానిక ఎన్నికలు రాబోతున్న సమయంలో గ్రామంలోని ఎన్నికల్లో పోటీపడేవారు మొదటగా రిక్వెస్ట్ బస్టాప్ నిర్మాణ స్థలాన్ని కాపాడితేనే మద్దతు ఉంటుందని యువత కోరుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. రిక్వెస్ట్ బస్టాప్ కోసం గ్రామంలోని విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డుపై ధర్నాకు దిగాలని సమలోచన చేస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. ఒకవేళ బస్టాప్ నిర్మిస్తే ఎక్కడ నిర్మించాలి. అంతకు ముందు అనుకున్న ప్రదేశం ఉందా లేదా అనేది చర్చలు జోరుగా కొనసాగుతున్నాయి. పెద్దకోడపాక క్రాస్ లో ముక్కు మూసుకొని నిలబడుతున్న ప్రయాణికులు సైతం ఆ ఫంక్షన్ హాల్ నుండి వేద జల్లుతున్న దుర్గంధం, దానితోపాటు రిక్వెస్ట్ బస్ స్టాప్ ఉండాల్సిన ప్రదేశం కోసం కూడా రోడ్డుపై ధర్నాలు చేయాలని సిద్ధమవుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొడపాక క్రాస్ వద్ద చర్యలు చేపట్టి ప్రయాణీలకు, పెద్దకొడపాక ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వేం కు బర్త్ డే
శుభాకాంక్షలు

అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డికి అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నేత బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గురువారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నరేందర్ రెడ్డి బర్త్ డే ను పురస్కరించుకొని గురువారం ఆయనను హైదరాబాదులో కలిశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు బొద్దిరెడ్డి వెంట ఉన్నారు.

ఇసుక క్వారీల్లో దౌర్జన్యం..!

- అంతా మా ఇష్టమే అంటున్న కాంట్రాక్టర్లు
- లోడింగ్ ఛార్జీ,ఎక్స్ ట్రా బకెట్ పేరుతో దోపిడీ
- ఆ సంబంధిత అధికారికి వాటా ఎంత..?
- ఇక్కడంతా ఓపెన్ సీక్రటేనంటూ జులూం
- ఆయా శాఖల అధికారులకు సైతం షేర్లు

అక్షరదర్బార్, కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో గోదావరి తీరాన ఇసుకాసురులు రాజ్యమేలుతున్నారు. కాళేశ్వరం పరిధిలో కొనసాగుతున్న ఇసుక క్వారీల్లో కాంట్రాక్టర్లు దౌర్జన్యం సృష్టిస్తూ కమాయిస్తున్నారు. అడ్డదిడ్డంగా ఇసుకను తోడుతూ తమకు నచ్చినట్లుగా అమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఇసుక క్వారీలు నడవాల్సింది ఉండగా ఇక్కడ అవేమి తమకు గిట్టవంటూ దర్జాగా అక్రమాలకు పాల్పడుతున్నారు. జీరో దందా,లోడింగ్ ఛార్జ్, ఎక్స్ ట్రా బకెట్పేరుతో రోజూ లక్షల్లో గడిస్తూ మాకెవ్వరూ అడ్డంటూ ఓపెన్ ఛాలెంజ్ విసురుతుండగా పట్టించుకోవాల్సిన సంబంధిత టీజీఎండీసీ,మైనింగ్,విజిలెన్స్,రవాణా శాఖల అధికారులు కాస్తా క్వారీ కాంట్రాక్టర్లు ఇచ్చే మామూళ్ల మత్తు నుండి తేరుకోలేక నిద్రావస్థలో ఉంటున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.ఇలా మహదేవపూర్ మండలంలో ఇసుక క్వారీల కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుకను తమకిష్టమొచ్చినట్లుగా తీసుకెళ్తుండగా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో వారు ఆడిందే ఆటగా పాడిందే పాటగా నడుస్తోంది.

- రోజూ లక్షల్లో సంపాదన

గోదావరి తీరాన ఇసుక మాఫియా తతంగంపై అడిగే వారే లేకపోవడంతో క్వారీ కాంట్రాక్టర్లు అక్రమార్జనకు తెరలేపుతున్నారు. లోడింగ్ ఛార్జెస్,ఎక్స్ ట్రా బకెట్ దందా పేరుతో అక్రమ దందాకు తెగబడి రోజూ లక్షల్లో అడ్డోగులుగా సంపాదించుకుంటున్నారు. ఆయా క్వారీల్లో లోడింగ్ ఛార్జ్ పేరుతో ప్రతీ లారీకి రూ.2వేలతో పాటు ఎక్స్ ట్రా బకెట్ కు రూ.2500 ఛార్జ్ చేస్తూ ఓవర్ లోడ్ వ్యవహారాన్ని బహిరంగంగానే నడిపిస్తుండడం గమనార్హం. ఓవైపు జిల్లా కలెక్టర్ ఓవర్ లోడ్ ను సహించేది లేదని కచ్చితమైన ఆదేశాలు జారీ చేసి కఠినతరం చేస్తున్నప్పటికినీ కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇసుక క్వారీల కాంట్రాక్టర్లు తమ అక్రమ దందాను యథేచ్ఛగా సాగించుకుంటున్నారు.మరో వైపు ఇసుక లారీలకు నంబర్ ప్లేట్ల ను మార్చుకుని మరీ ఇసుక ను తరలించే ప్రయత్నం చేయగా పట్టుబడిన ఘటనలు లేకపోలేదు. కాగా అడ్డొచ్చే ఎంతటి వ్యవస్థనైనా సరే అవలీలగా అవగతం చేసుకుంటున్న కాంట్రాక్టర్లు తమ వ్యాపారాన్ని క్రమక్రమంగా విస్తరించుకుపోతున్నారనేది బహిరంగ సత్యమనే చెప్పుకోవచ్చు.క్వారీల్లో ఇంతలా జరుగుతున్నప్పటికినీ సంబంధిత అధికారులంతా ఏమవుతున్నారనే వాదనాలు ప్రజల్లో బలంగా వినిపిస్తుండగా ఇక్కడంతా వారికి షరా 'మామూళ్లే'నంటూ అంతటా చర్చించుకోవడం గమనార్హం.

- ఆ అధికారికి వాటా ఎంత...?

ఇసుక క్వారీల్లో నడుస్తున్న అక్రమ దందాను అడ్డుకోవాల్సిన ఆ అధికారికి క్వారీల్లో వాటా ఉందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక క్వారీలు నడవాల్సింది ఉండగా అందుకు విరుద్ధంగా మహదేవపూర్ మండలంలో ఆ అధికారి అండదండలతో అడ్డదారుల్లో క్వారీలు నడుస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. క్వారీ యజమానులంతా సిండికేట్ గా మారుతుండగా క్వారీకి నెలనెల చొప్పునా వారి అక్రమ సంపాదనల్లో ఆ అధికారికి వాటా సమర్పించుకుంటూ సజావుగా తమ దందాను నడిపించుకుంటున్నట్లుగా తెలుస్తోంది. లోడింగ్ ఛార్జ్, ఎక్స్ ట్రా బకెట్ పేరుతో ఆ శాఖలోని కింది స్థాయి సిబ్బందినే మీడియేటర్ గా ఉంచుకుంటున్న ఆ అధికారి రోజూ వచ్చిన వాటాలో కాంట్రాక్టర్ కు సగం ఆ అధికారికి సగంగా అక్కడే పంచుకుంటారన్నట్లుగా సమాచారం. అంతేకాకుండా సదరు కాంట్రాక్టర్లు ఆ అధికారి అడిగినప్పుడల్లా కాస్ట్లీ గిఫ్టులతో పాటు పార్టీలు ఇవ్వాల్సిందేనని బయట టాక్ సైతం నడుస్తున్నది.ఇంతలా ఆ అధికారి బరితెగించి వాటాలు తీసుకుంటుండగా ఇక పట్టించుకునేది ఎవరంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆర్ఐపై దాడి హేయమైన చర్య

- టీఆర్ఈఎన్జీఏ అధ్యక్షుడు రవి

అక్షరదర్బార్, వరంగల్: మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవేంద్ర నగర్ (కాప్రా) రెవెన్యూ ఇన్ స్పెక్టర్ రమేష్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి పేర్కొన్నారు. దేవేంద్ర నగర్ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టగా ప్రభుత్వ భూమిని పరిరక్షించే క్రమంలో విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ ఇన్ స్పెక్టర్ రమేష్ పై దుండగులు దాడి జరపటాన్ని హేయమైన చర్యగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇది క్షమించదగింది కాదని, దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, లగచర్ల ఘటనలో ఏకంగా జిల్లా కలెక్టర్ పై దాడి చేసిన నిందితులు రిమాండ్ కు పోయి బెయిల్ పై బయటకు వచ్చిన విషయం మరవకముందే మంగళవారం ఆర్ఐ రమేష్ పై దాడి జరగటంతో రెవిన్యూ ఉద్యోగుల్లో ఆందోళన చోటు చేసుకుందని తెలిపా రు. రమేష్ పై జరిగిన దాడి ఘటనలో ఎంతటి వారు ఉన్నా తక్షణ మే కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కా కుండా నిందితులకు శిక్షపడేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

స్థిరమైన వ్యవసాయానికి పునాది ఫార్మతాన్

అక్షరదర్బార్, హైదరాబాద్: నేషనల్ ఫార్మతాన్ 2024 నాగరత్నం నాయుడు ఫార్మ్ వేదికగా బుధవారం హైదరాబాద్ శివారులోని ఘట్ కేసర్ వద్ద ఓ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ 1,000 మంది విద్యార్థులు, 200 రైతులు, 200 వినియోగదారులు,10 మంది ప్రఖ్యాత ప్రముఖులు పాల్గొనడం ద్వారా అద్భుత విజయాన్ని సాధించింది. ఇది యువ రైతుల భవిష్యత్ ఆవిష్కరణలపై నవరత్నం నవరత్నాలు ప్రాజెక్ట్ పై చర్చలకు కేంద్రీకృతమైంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా యువ రైతులకు శిక్షణనిచ్చి, భారత వ్యవసాయ రంగానికి ఆధునిక మార్గాలు చూపించాలనే లక్ష్యంతో 20 విభాగాల పోటీలలో విజేతలను సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వేణుగోపాల్ (ఏవి సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు), నాగరత్నం నాయుడు (ఆతిథ్య ఆహ్వానకర్త), వెంకట్ రెడ్డి (ఎస్వీఆర్ గ్రూప్ చైర్మన్), డా.మురళీధరన్ ఆచార్య (స్థిరమైన అభివృద్ధి నిపుణుడు), పి. విజయ గోపాల్ రెడ్డి (అగ్రి నాయకుడు), డి. నరసింహ రెడ్డి (పర్యావరణ, అభివృద్ధి నిపుణుడు), భాస్కర్ రెడ్డి దాసరి (సీబీఐటీ వ్యవస్థాపకుడు) వ్యవసాయంలో సాంకేతికత, సంప్రదాయాలను మిళితం చేసే దిశగా ప్రసంగించారు.

పుష్ప-2పై ఫిర్యాదు

- దర్శకుడు, నిర్మాత, హీరోపై చర్యలు తీసుకోవాలి
- హన్మకొండ పీఎస్ లో సీనియర్ జర్నలిస్టు గడ్డం కేశవమూర్తి కంప్లైంట్

అక్షరదర్బార్, హన్మకొండ: నేర ప్రవృత్తిని ప్రోత్సహించడంతో పాటు, పోలీస్, రాజకీయ వ్యవస్థను పూర్తిగా కించపరిచే విధంగా నిర్మించిన పుష్ప 2 చిత్ర దర్శకుడు, నిర్మాతలు, హీరోపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీనియర్ జర్నలిస్టు గడ్డం కేశవమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు హన్మకొండ పోలీస్ స్టేషన్లో సీఐ సతీష్కు ఫిర్యాదు చేశారు. మైత్రి మూవీ మేకర్స్ సారథ్యంలో దర్శకుడు సుకుమార్ నిర్మించిన పుష్ప 2 చిత్రం పూర్తిగా నేర ప్రవృత్తిని పెంచి పోషించే విధంగా ఉన్నదని, సమాజహితం కోరుతూ సామాజిక అంశాలను తీసుకుని ఈ సినిమా నిర్మించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చెక్కుల పంపిణీ

జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి

అక్షర దర్బార్,నర్సింహులపేట : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంఆర్ చెక్కుల పంపిణీ న్యాయ బద్ధంగా జరుగుతుందని,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ చెక్కుల పంపిణీలో దళారుల చేతిలో పదుల సంఖ్యలో నష్టపోయిన వారు ఎంతో మంది ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక అలాంటి వ్యవస్థను రానీయకుండా బాధితులకే సత్వర న్యాయం జరుగుతుం దని జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి అన్నారు. గురువారం నర్సింహులపేట మండలంలోని పెద్ద నాగారం గ్రామాలలో జగ్గు తండా, గోపతండ లో సీఎం ఆర్ చెక్కుల పంపిణీ చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడమే మా ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొబ్బ సోమిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ము అనిల్, బొబ్బ అశోక్ రెడ్డి, అజ్మీర రాజేందర్, అజ్మీర ఈరు, శంకర్, లక్ పతి, రమేష్, ప్రసాద్,బంగారయ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

చికిత్స పొందుతూ మాజీ ఎంపీటీసీ మృతి

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తాళ్ల మార్కండేయ గురువారం సాయంత్రం మృతి చెందాడు గ్రామస్తుల కథనం ప్రకారం ఆదివారము చిట్యాల మండలంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో తాళ్ల మార్కండేయ తీవ్రంగా గాయపడ్డాడు. వరంగల్ లో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. మార్కండేయ మృతి చెందడంతో గొర్లవీడు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.